# సమానాంతర రేఖలు

రాజారావు యింటికి వచ్చేసరికి, బాగా అలిసిపోయి వున్నాడు. రోజంతా యిన్‌స్పెక్షన్‌తో గడిచింది. తలదిమ్ముగా వుంది. వస్తూనే సోఫాలో కూలబడి, ఓ సిగరెట్ ముట్టించాడు.

"కుసుమా !" మెల్లగా కేక వేశాడు.

కుసుమ రాలేదు. కాని, వంటమనిషి ప్రత్యక్షం.

"అమ్మగారు బజారుకి వెళ్లారండీ! బట్టలేవో కొంటారట..." అందామె.

కుసుమతో కాస్సేపు వుల్లాసంగా కబుర్లు చెప్పుకుంటూ కూచుంటే, అలసటంతా మర్చిపోవచ్చుననుకున్న రాజారావుకి, నిరాశ యెదురయ్యింది. అతని కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"కారు నేను తీసుకు వెళ్ళానే!"

"రిక్షాలో వెళ్ళారు బాబూ!" జవాబిచ్చింది వంట మనిషి.

రాజారావు ఆలోచనలో పడ్డాడు. కుసుమ, తనని చులకన చేస్తున్న దేమోనన్న అనుమానం, అతనిలో తళుక్కు మంది. కాస్తంత బాధపడ్డాడు. వైవాహిక జీవితం గురించి,

తను యెన్నో తియ్యని కలలు గన్నాడు. కాని, ఈ కలలన్నీ యిప్పుడు యెండమావులుగా దృగ్గోచర మౌతున్నాయి. భార్యనుండి ఆశించినంత అభిమానం పొందలేక పోవడం, తన దురదృష్టమేమో ననుకుంటూ వుంటాడు అప్పుడప్పుడు. ఎంత ప్రయత్నించినా ఆమెధోరణి మార్చుకోవడం లేదు. ఒక విధమైన ఆధిక్యతతో ప్రవర్తిస్తున్న దేమోనని యిప్పుడనుకున్నాడు. అతనిలోని సహనం, క్రమంగా నశించుతోంది. ఔనుమరి! సహనానికీ ఒక హద్దు వుండాలిగా!

సోఫా వెనక్కి చేరబడి, మరో సిగరెట్టు ముట్టించాడు. మనసులో యెన్ని తుఫానులువున్నా, బాహ్యంగా ప్రశాంతంగా వున్నట్టే కనిపిద్దామనే ప్రయత్నం విఫలమయ్యింది. గట్టిగా పొగపీల్చి వదిలాడు మీదికి. అతని చుట్టూ, పొగముసురుకుంది.

"కాఫీ తీసుకొచ్చేదా బాబూ!" అడిగింది వంటమనిషి.

"ఏమీ వద్దు వెళ్ళు..." గంభీరంగా చెప్పాడు.

ఆమె వెళ్ళిపోయింది.

టీపాయ్ మీదున్న పేపరుతీసి, చదవాలని ప్రయత్నించాడు రాజారావు. కాని, సాధ్యపడలేదు. అక్షరాలన్నీ అలికినట్టు అగుపిస్తున్నాయి. పేపరు మళ్ళీ పడేశాడు. కూచోను బుద్ధిపుట్టలేదు. లేచి గదిలో పచారుచేయడం ప్రారంభించాడు. గడియారం 'టంగ్', 'టంగ్' మంటూ యేడు కొట్టింది. అదే సమయంలో బైట రిక్షా ఆగింది.

"మీరొచ్చి యెంత సేపయిందండీ?" అంటూ చేతిలో వున్న పేకెట్లు టీపాయ్ మీద పడేసి, యెంతో అలసిపోయి నట్టుగా నిట్టూర్చింది కుసుమ.

రాజారావు తృటికాలం ఆమె మొహంలోకి సూటిగా చూశాడు. ఆయన చూపులోని భావం కుసుమకి అర్థం కాలేదు.

"నేను యెప్పుడు వచ్చానో, నీకు అవసరమైన విషయమే నంటావా కుసుమా?" ఆవేశాన్ని అణచుకుంటూ మెల్లగా అడిగాడు.

కుసుమ మొహంలో రంగులు మారాయి. పచ్చని మొహం కెంపురంగు దాల్చింది. భర్త అలా అంటాడని, ఆమె యెప్పుడూ వూహించలేదు.

"అదేవిటండీ, అలా అంటారు?" ఆశ్చర్యంతో అంది.

రాజారావు నిట్టూర్చాడు గట్టిగా.

"మరేమనమంటావో, చెప్పు కుసుమా! ఎంతసేపూ నీ సరదాలు నీవేగాని, నా విషయం యే ఒక్కనాడూ నువ్వు ఆలోచించలేదు. రోజంతా శ్రమించి యింటికివస్తే, చిరునవ్వు మూటలుగట్టుకుని ఎదురుగావచ్చి, మృదుమధురంగా పలుకరించే భార్య వుండికూడా, ఆ అదృష్టం నాకు లేకపోతోంది."

భర్త మనోభిప్రాయం, కుసుమకి అర్థమయ్యింది. ఆమె లోని అభిమానం దెబ్బతిన్నది. ఆయన్ని నిర్లక్ష్యం చేస్తున్నట్టు ఆమె భావించనేలేదు. అనవసరంగా భర్త తనమీద యీ

అభియోగం తీసుకొస్తున్నారనే బాధ, ఆమెలో కోపాన్ని రేకెత్తించింది. అయితే, తను కేవలం కొన్ని కట్టుబాట్లకు బద్ధురాలై, ఒక పరిధిలో వుండటం, సాధ్యంకాదేమో ననిపించింది. నిజానికి తన మనస్తత్వమే వేరు. తనకి స్వేచ్ఛకావాలి. తన మనస్సుకి నచ్చిన పని చేయగలిగే స్వేచ్ఛకావాలి. ఇంత వరకూ పుట్టింట, స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవితం సాగించింది. తండ్రి తనని ఒక పరిధిలో వుంచడానికి, ఎప్పుడూ ప్రయత్నించ లేదు. ఆయన సంస్కారం వేరు. కాని, యిప్పుడు తనని ఒక పరిధిలో వుంచే ప్రయత్నం భర్త ద్వారా జరుగుతూ వుండటం, ఆమెలో అసహనాన్ని రేపింది.

"అయితే, మీరనేదేవిటి? ఇరవై నాలుగ్గంటలూ, మిమ్మల్ని అంటిపెట్టుకూర్చోమంటారా? అలాగే కానీయండి. మీరు ఎక్కడికి వెళ్తే అక్కడికే వస్తాను" విసురుగా అంది. ఆమె మొహం రాగరంజిత మయ్యింది.

రాజారావు నిర్ఘాంత పోయాడు, ఆమె విపరీత మనస్తత్వానికి.

"అదేవిటి కుసుమా! అలా నేను అనలేదే! నన్ను అపార్థం చేసుకుంటున్నావు. తొందరపడకు. నేను యింటికి వచ్చేవరకూ వుంటే, యిద్దరమూ కలిసి వెళ్ళేవాళ్ళంగా!"

"నేనూ కాదని చెప్పలేదుగా! మీరు యేడుగంటలకు ముందు, ఎప్పుడూ రారు. అంతవరకూ ఒంటరిగా యింట్లో కూచోవడం దుర్భరమనిపిస్తోంది."

కుసుమ తత్వం అతనికి సమంగా అర్థం కాలేదు.

"ఇంట్లో వుండటం—దుర్భరమనుకుంటే, ఇంకేం చెప్పను! మీ యింట్లోవున్నప్పుడూ యిలాగే తిరిగేదానివా?" సూటిగా ప్రశ్నించాడు.

"చదువుకున్న దానను. నాకు స్వేచ్ఛవుంది. మా నాన్న గారు నా స్వేచ్ఛకు యేనాడూ అడ్డురాలేదు. నన్ను పంజరంలో పక్షిలా వుంచడానికి, ఆయన ఎప్పుడూ ప్రయత్నించలేదు."

రాజారావు మనస్సు చివుక్కుమంది. తనమీద పరోక్షంగా దెబ్బకొట్టిందని భావించాడు.

"అంటే, నిన్ను నేను పంజరంలో వుంచడానికి ప్రయత్నిస్తున్నానంటావా?"

కుసుమ నిర్లక్ష్యంగా మందహాసం చేసింది.

"మీ ఆంతర్యం తెలుసుకుందుకు మీరే ప్రయత్నించండి. నేను వేరే చెప్పనవసరంలేదు..." అంటూ విసురుగా లోపలికి పోవడానికి ప్రయత్నించింది.

రాజారావులో ఎంత సహనంవుందో, అంత అభిమానం వుందిమరి! అతని కళ్ళల్లో కోపం, ఎరుపుదనాన్ని సృష్టించింది.

"ఆగు కుసుమా!" అంటూ ఆమెకి దగ్గరగా నడిచాడు. తను ఆశించిన ఆనందాలు అందుబాటులో లేకపోవడం, కోపమూ విసుగూ కలిగించాయి.

కుసుమ, భర్త కేసి అదోలా చూసింది. ఏమీ మాట్లాడ లేదు. రాజారావు అన్నాడు.

"నీ భావాలు మార్చుకోవడానికి ప్రయత్నించు కుసుమా! ఇన్నాళ్లూ నువ్వు, మీ యింట్లో పూర్తి స్వతంత్రంతో మెలిగావు. కాదనను. కాని, యిప్పుడు మరో యింటి కోడలుగా వచ్చావు. నా అర్థాంగివి. భార్యగా నీ కర్తవ్యాన్ని నెరవేర్చ వల్సిన బాధ్యత నీమీద వుంది."

కుసుమకి ఈ మాటలు సూదుల్లా గ్రుచ్చుకున్నాయి.

"నా కర్తవ్యాన్ని విస్మరించానని నేను అనుకోనండీ! ఆ విషయం మీరు గుర్తుకు తీసుకురావడం అనవసరం" చిరుకోపంతో అంది.

ఆమె మొండి వాదనకి ఏమనాలో అర్థం కాలేదు, రాజారావుకి.

"నీ కర్తవ్యాన్ని అక్షరాలా నిర్వహిస్తున్నానని నువ్వు అనుకుంటున్నావు. కాని, నీ అభిప్రాయం తప్పు కుసుమా; ఆ అభిప్రాయంతో వుంటే నిన్ను నువ్వే వంచించుకుంటున్నట్టవు తుంది. స్త్రీకికూడా స్వేచ్ఛవుండాలి. కాదనను. కాని దానికి పరిమితి వుండాలి. భర్త మనసుని నొప్పించే స్వేచ్ఛ, స్వేచ్ఛ కాదు. అది ఆధిక్యత అనిపించుకుంటుంది."

కుసుమ భర్తకేసి తీక్ష్ణంగా చూసింది.

"నేనేం హద్దులు మీరలేదు. మీరు అలా అనుకుంటే, అది నా తప్పు కాదు. గృహిణిగా నా బాధ్యత, కర్తవ్యమూ, ఏవిటో నాకు బాగా తెలుసు. ప్రతి విషయంలోనూ మీరు నన్ను ఒక పరిధిలో వుంచడానికి ప్రయత్నించకండి..." అంటూ చరచరా లోపలికి పోయింది.

రాజారావు స్తంభించి పోయాడు. కుసుమ అంత నిర్లక్ష్యంగా జవాబిస్తుందని అతను వూహించలేదు. అతని స్వాప్నవిక లోకాన్ని ఎవరో కదిల్చినట్టయ్యింది. భార్యలో ఎలా మార్పు తీసుకురావడమో, అర్థంగాక మార్గాలకోసం ఆలోచించాడు. కాని, వూహకి యేమీ తట్టలేదు.

బరువెక్కిన హృదయంతో సోఫాలో కూలబడి, సిగరెట్ ముట్టించాడు. అలా కూచుని యెన్ని సిగరెట్లు కాల్చాడో, 'ఆష్ ట్రే' లోని పీకల్ని లెక్కబెడితేగాని తెలీదు.

"లేవండి బాబూ! భోజనం చేద్దురుగాని..." అంటూ వచ్చింది వంటావిడ.

"ఆకలిగా లేదులే...వెళ్లు..." అనేసి పడకగది కేసి చరచరా నడిచాడు రాజారావు.

అప్పుడే గడియారం తొమ్మిది గంటలు కొట్టింది. ఒక్కో గంటా, ఒక్కో సమ్మెటపెట్టులా బాధించింది రాజారావుని.

* * *

రోజులు గడుస్తున్నాయి. కుసుమలో క్రమంగానైనా పరిణామం వస్తుందని ఆశించిన రాజారావుకి ఆశాభంగమే కలిగింది. పైగా అమె నిర్లక్ష్యం, మరింత వుక్రోషాన్ని రేపింది.

ఆ రోజు రాజారావు కాస్త పెందలాడే యిల్లు చేరుకున్నాడు. భర్త యింట్లోవున్న విషయాన్ని పట్టించుకోకుండానే, రిక్షా తెప్పించుకుని బైలుదేరింది కుసుమ. బైలుదేరుతున్నప్పుడు మాత్రం చెప్పింది.

రాజారావుకి, ఛెళ్ళున లెంపకాయ కొట్టినట్టయ్యింది. ఆమె తనని చులకన చేస్తోందన్న విషయం నిర్ధారణ చేసుకున్నాడు. చెప్పలేనంత బాధతో కుంచించుకు పోయాడు. భర్తగా తనకిగల స్థానాన్ని గుర్తుకు తెచ్చుకుని మరింత మండి పోయాడు.

"ఆగు కుసుమా!" కోపంగానే అన్నాడు. మేఘాలు లేకుండా వురిమినట్టయ్యింది.

కుసుమ ఆగి, వెనుదిరిగి చూసింది. ఎందుకాపారు?... అన్నట్టుగా వున్నాయా చూపుల తీవ్రత.

"నువ్వు యిప్పుడెక్కడికీ వెళ్ళడానికి వీల్లేదు. నేను ఇంట్లో వున్నప్పుడు కూడా యిలా తిరగడమేమిటి!" ఒక విధంగా ఆజ్ఞాపించే ధోరణిలోనే అన్నాడు.

కుసుమ స్తబ్ధురాలయ్యింది. చదువూ, సంస్కారం, హోదా యివన్నీవున్న భర్త అలా ప్రవర్తించడం, ఆమెకి

వెగటుగా తోచింది. తను యెలా ప్రవర్తించినా అతను సహించే వూరుకోవాలని గర్వం, ఆమెలో పేరుకుని వుండటంవల్లనే ఆమెకి అలా అనిపించి వుండవచ్చు.

"నన్ను ఆజ్ఞాపిస్తున్నారా?" విసురుగా వెనక్కి తిరిగివచ్చి అంది.

"ఔను, ఆజ్ఞాపిస్తున్నాను! నీలో మార్పు వస్తుందన్న ఆశతో, ఇన్నాళ్లూ పట్టించుకోలేదు. నాకూ వ్యక్తిత్వమూ, అభిమానమూ, అన్నవి వున్నాయన్న విషయం మర్చిపోకు. నా హక్కులు నిలబెట్టుకోవడం నాకూ తెలుసు."

కుసుమలో పేరుకొనివున్న గర్వానికి, చేదోడుగా 'అభిమానం' చేరింది. ఆమె సహనాన్ని కోల్పోయింది. తను స్త్రీననీ, ఆయనభార్యననీ మర్చిపోయిందాక్షణంలో.

"నా హక్కు నిలబెట్టుకోవడం, నాకూ తెలుసు. నన్ను మీరు మీ బానిసగా అదుపులో వుంచడానికి ప్రయత్నించడం, నేనూ సహించలేను..." హెచ్చు స్థాయిలో అంది.

"అపార్థం చేసుకుంటున్నావు కుసుమా! నేనెప్పుడూ నిన్ను చులకన చెయ్యలేదు. కాని, నువ్వే ఆధిక్యతతో ప్రవర్తిస్తున్నావు. భార్య ఆధిక్యతను యే భర్తా సహించలేడు."

"నన్ను నిందించేముందు, మీ ప్రవర్తనని మీరు గుర్తుకు తెచ్చుకోండి. మీ ప్రవర్తన జుగుప్స కలిగిస్తోంది. ఈ వాతావరణంలో నేను వుండలేను. రేపే మా నాన్న దగ్గరికి పోతాను..." తుఫానులా లోపలికి పోయింది.

రాజారావు నిర్విణ్ణుడయ్యాడు. గట్టిగా శ్వాసవిడిచి, సోఫాలో కూలబడ్డాడు. తన తప్పేమీ లేదని అతని విశ్వాసం!

* * *

మరుసటిరోజే వెళ్ళిపోయింది కుసుమ. రాజారావు కాదనలేదు. అతనికి తెలుసు — కుసుమ మనస్తత్వం, తన మనస్తత్వానికి పూర్తిగా విరుద్ధమని; ఎట్టి పరిస్థితుల్లోనైనా, యిరువురికీ సౌఖ్యం కుదరడం కష్టమేననిపించింది. అందుకే, యేమీ అనలేదు.

కుసుమ వెళ్ళిపోయి, వారం రోజులు గడిచాయి. ఆమె నుండిగాని, వాళ్ళ నాన్న దగ్గర్నుంచిగాని, వుత్తరం వస్తుందని యెదురు చూశాడు. కాని, రాలేదు. అందుకే, తనే ఓ ఉత్తరం రాశాడు. శాశ్వతమైన ఓ నిర్ణయానికి రావడం మంచిదని అందులో తెలియజేశాడు. దానికి జవాబుగామాత్రం, కుసుమ దగ్గర్నుంచి వుత్తరం వచ్చింది. ఆ ఉత్తరం చదువుకుని, రాజారావు గట్టిగా ఓ నిట్టూర్పు విడిచి, నవ్వుకున్నాడు లో లోన. మళ్ళీ ఓసారి చదువుకున్నాడు.

శ్రీవారికి నమస్కారము

మీ ఉత్తరం చేరింది. మీరన్నట్లు, మనవి విరుద్ధ మనస్తత్వాలు. ఎప్పటికైనా, మన అభిప్రాయాలు యేకమౌతాయన్న విషయం, స్వప్నమే మరి! అందుకే, మనం విడాకులుతీసుకుంటే అన్నివిధాలా శ్రేయస్కరమని నా అభిమతం. కనీసం, యిందులోనైనా నా అభిప్రాయంతో యేకీభవిస్తారని

తెలుస్తాను. ఇందులో ఓ కాగితం పంపుతున్నాను. సంతకం చేసి పంపండి. వుంటాను మరి.

మీ కుసుమ.

ఆమె అలా రాసినందుకు రాజారావు బాధపడలేదు. అతను కోరేదీ అదే! క్షణక్షణానికీ ముళ్ళ కంపలు దాటవల్సి వస్తున్న ఆ బాటతప్పించితే మంచిదని భావించాడు. ఆలోచించ కుండా ఫారమ్‌మీద సంతకంపెట్టి, ఆరోజే పోస్టు చేయించాడు. ఆ రోజుతో తనకీ, కుసుమకీ గల అనుబంధం తెగిపోయిందని ఆఖరుసారిగా కాస్తంత బాధ పడ్డాడు. క్షణంలో మళ్ళీ తేరుకున్నాడు.

అతని మెదడు నిండా ఆలోచనలే! తన వైవాహిక జీవితం యెందుకలా భగ్నమయ్యింది? అన్న ప్రశ్నే పదేపదే ఆలోచించాడు.

కాని, దానికి సమాధానం యెవరిస్తారు? అంతే! ఎవ రెవరి అదృష్టాల్నిబట్టి వారి వివాహ జీవితం వుంటుంది. లేకపోతే, విపరీత మనస్తత్వంగల కుసుమ, తనకి భార్యగా లభించడ మేవిటి? ఆమె స్వతహాగా అటువంటి మనిషే అయినా, తను అభిమానంకోసం, వ్యక్తిత్వంకోసం ప్రాకులాడే తత్వంగల వాడవ్వడమేవిటి? అంతే! ఎలా జరగవల్సింది, అలా జరి గింది!...అనుకున్నాడు.

రేడియోలో ప్రేమగీతం విన్పిస్తోంది. నవ్వుకున్నాడు రాజారావు.